# జ్ఞానోదయం

కారు వెనక తలుపుతీసి బరువుగా ఉన్న సూట్ కేస్ సీటుమీద పడేసి తలుపు గట్టిగావేసి ముందుకివొచ్చి లోపల కూర్చుంది కల్యాణి. శేఖర్ ఆమెవైపు చూడకుండానే 'తాళం?' అన్నాడు.

ఆమెకి వినిపించినట్టే లేదు—'పదండి' అంది కళ్యాణి.

అతను కార్ స్టార్ట్‌చేసి ముందుకి సాగేడు.

ఒక్కసారి వెనుదిరిగి చూద్దామనుకుంది కల్యాణి; కాని మనస్సునీ కళ్లనీ అదుపులో పెట్టుకుని విండ్‌షీల్డ్‌లో నించి తిన్నగా బయటికి చూస్తూ ఉండిపోయింది.

నాలుగైదుమైళ్లు గతుకులదారి— ఈ పల్లెటూరికి మంచి—రోడ్ వేసే ఆశగాని, ఉద్దేశంగాని, ఎప్పుడూ ఎవరికీ కలిగినట్లు లేదు.

మరో ఐదునిమిషాలు అటూ ఇటూ ఉన్న పొలాలనీ, అంద వికారంగా రోడ్డుకి అటూ ఇటూ నిలబడిన సగం కొట్టేసిన చెట్లనీ కళ్లు తిప్పకుండానే గమనిస్తూ ఆ ఊరిపొలిమేరలు దాటుతూన్న ఉత్సాహాన్ని కష్టంగా దాచుకుంది కళ్యాణి. శేఖర్ కళ్లు రోడ్డుమీదనించి తప్పకుండా తనవైపు చూడకుండా ఉండడం ఆమెలో కృతజ్ఞతని కలిగించింది...అతను

చేసిన, చెయ్యబోతున్న సహాయా లన్నిటిలోనూ ఇది చాలా ముఖ్యమైనదనిపించింది— ఆ క్షణాల్లో.

'ఎలా ఉంది తనకి?' అని ప్రశ్నించుకుంది కళ్యాణి. ఆ ప్రశ్న వేసుకోవడం ఆమెకి జ్ఞానంవొచ్చిన దగ్గరినించీ జ్ఞాపకం ఉంది. తనలో, తన ఆంతరాంతరాల మరుగులో ఎక్కడో నిద్రిస్తోన్న న్యాయమూర్తి అడిగినట్టుంటుంది ఆప్రశ్న.

పంజరంలో ఉంచిన పక్షిని ఒక్కసారి గాలిలోకి, స్వేచ్ఛ లోకి, ఒదిలేస్తే ఎలాగ ఉంటుందో అలాగే ఉందనిపించింది కళ్యాణికి. ఇప్పటిదాకా తన జీవితానికీ, పజంరంలోని పక్షికీ సామ్యం కనిపించలేదామెకి. కాని ఊరు దాటుతూ, మనస్సు కళ్లతో వెనక్కితిరిగి చూసుకుంటే ఆయిల్లు, తాటాకుల, ఒక్కగది ఇల్లు, పంజరంలాగే కనిపించింది.

కారు వేగంలేకుండానే గతుకులబాటలో కష్టంగా సాగుతోంది.

'నేను తప్పుచేశానా?' అని ప్రశ్నించుకుంది కళ్యాణి. ఆ ఆలోచన బయటికి రాకుండా ఆమె చాలా ఇతర భావాలని దాని మీద కప్పినా, మేఘాల నల్లదనంలోనించి సూర్యుడిలాగ ఆ ఆలోచన రానే వొచ్చింది... కళ్లు మూసుకుని కాదంటే పోయేలాగ కాదు.

ఏం చేస్తోంది తాను?

'పంజరంలోనించి...'—కాదు ఇంటినించి పారిపో తోంది. ఆ పాక ఇల్లు, ఒంటిగది ఇల్లు, విద్యుద్దీపాలులేని ఆ సగం చీకటి ఇంటినించి తాను పారిపోతోంది.

ఇంకేమిటి చెయ్యగలను? అనుకుంది కళ్యాణి. ఊపిరి సలిపినంతసేపు తానా ఇంటికి దీపంగానే ఉంది. కాని, కనిపిం చని ఆ సంకెళ్లమధ్య తనకి ఊపిరి తీసుకోవడమే కష్టమైంది. అక్కడ వెలగడం సరేసరి, బ్రతికి ఉండడం కూడా ఇంక తనవల్ల కాదనేదాకా తానా ఇంటిలో ఉంది. రెండేళ్లు... ఈరోజుకి, సరిగ్గా —అక్కడ కాపురం చేసింది. మెడకి తాడు లాగ ఆ జీవితం క్రమక్రమంగా బిగుసుకు పోతూంటే పారి పోక, తప్పించుకుని తన ప్రాణ రక్షణ కోసం పారిపోక, ఇంకే మిటి చేస్తుంది?

రోడ్డు మీద గొయ్యి—సగం నీటితో. శేఖర్ ఆగి, అతికష్టంతో కారుని పక్కనించి నడుపుతున్నాడు. కుదుపుకి పాత అంబాసిడర్ కిట కిట లాడుతోంది.

రెండేళ్ళు......

అప్పుడు విచిత్రంగా మూర్తితో తన వివాహం జరిగి పోయింది. బి. ఏ. రిజల్ట్సు వొచ్చాక, తాను పాసైన సంతో షంలో, ముందేమి చెయ్యాలన్న ఆలోచనల్లో, ఊగులాడు తూంటే ఒకనాడు మూర్తి తన ఇంటికి వొచ్చాడు, నాన్నగారి కోసం అడుగుతూ.

'ఇంట్లో లేరు—గుడికి వెళ్లేరు...' అంది.

అతను 'మళ్ళీ వొస్తా'నని చెప్పి బయటికి వెళ్ళబోయాడు.

'కూర్చోండి...మరో పది నిమిషాల్లో ఆయన రానే వొస్తారు' అని క్రమంగా, లాంఛనంగా ప్రారంభించిన మర్యాదలోని తన ప్రశ్నలు కొంత కుతూహలంగా మారడం గమనించి తానే ఆశ్చర్యపోయింది, కళ్యాణి.

అతను వొద్దని వారించినా కాఫీ పెట్టితెచ్చి ఇచ్చింది. అతను ఇబ్బందిగా ముఖం పెట్టడం చూసి, 'ఏం కాఫీ బాగా లేదా?' అంది నవ్వుతూ.

'అబ్బే—అదేం కాదండి! అసలు కాఫీ తాగే అలవాటు లేదు నాకు!' అన్నాడు మూర్తి.

ఆశ్చర్యంగా, 'మరి? టీ తాగుతారా?' అంది కళాణి.

'లేదు అసలేవీ అలవాటు లేదు...టీ, కాఫీ, సిగరెట్ ... ఏవీని' అన్నాడు మూర్తి.

'పోనీండి—వ్రతభంగం ఐతే తాగొద్దు.' అంది కొంచెం బాధపడి, కళ్యాణి.

'వ్రతమేం లేదు లెండి...' అని చివరికి కష్టంగానే అతను కాఫీ తాగేడు.

'ఏ ఒక్క దురలవాటూ లేకుండా మీరు ఏమ్. ఏ. ఎలాగ పాసయారు?, అంది కళ్యాణి. తనకిప్పటికీ జ్ఞాపకం—అతన్ని మాట్లాడించాలని ఎందుకో కోరికగా ఉండేది.

'ఆ మాటే చాలామంది అడిగారు.'

'మరి ?'

'కష్టపడి చదివి...

ఆమె నవ్వుదామనుకుంది. కాని, అతని గంభీరమైన ముఖం చూసి, నవ్వు రాలేదు తనకి.

ఆ సంభాషణ చాలాసేపు సాగింది. అతను తన పల్లెటూరి హైస్కూలులో ఉపాధ్యాయుడిగా ఉన్నాడనీ, వెనుకబడ్డ ఆ ప్రాంతంలో విద్యా సౌకర్యం చేతనైనంత మందికీ కలుగజెయ్యడమే అతని విధిగా అతను నమ్మాడనీ విని, 'ఎంతకాలం అలాగ?' అని అడిగింది కళ్యాణి.

'శక్తి ఉన్నంతదాకాను' అన్నాడు మూర్తి.

అప్పుడతను పెద్ద ఉద్యోగంకోసం ప్రయత్నించకపోవడం, కనీసం ఒక లెక్చరర్ పదవికోసం ప్రయత్నమైనా చెయ్యకపోవడం ఆమెకి చాలా ఆదర్శవంతంగా కనిపించింది. ఆ మాటే అతనికి చెప్పింది కూడా.

ఆ సాయంత్రందాకా అతనూ, తన తండ్రీ ఏవో విషయాలు చర్చించుకుంటూనే ఉన్నారు. రాత్రి భోజనం చేస్తూంటే తండ్రి తన వివాహ ప్రస్తావన తెచ్చాడు.

'ఇప్పుడు పెళ్ళికి తొందరేమిటి నాన్నా?' అంది కళ్యాణి.

ఆ కారణం కూడా ఆమెకి ఆశ్చర్యంగానే వినిపించింది. మూర్తి తనని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటాడనే విషయం ఆమెకి తట్టనేలేదు.

తా నంగీకరించడం, మర్నాడే వివాహం, తాని క్కడికి వొచ్చేయడం, తండ్రి హృషీకేష్ వెళ్ళిపోవడం, అన్నీ త్వరత్వరగా జరిగిపోయాయి. తన జీవితంలో అంత మార్పు అంత త్వరగా వొచ్చేసింది— ఆగి, జీవితాన్ని అపి, ఆలోచించు కునే అవకాశం లేనే లేకుండా. అప్పుడలాటి అవకాశం అడగ లేదు కల్యాణి; ఆ ఉద్దేశం ఆమెకి రాలేదు: ఎవరో ఆ పనిచేసి ఉండాల్సింది...ఎవరో.

*　　　*　　　*

కారు గతుకులబాటని మింగేసి పెద్ద రోడ్ కలిసే చోటికి వచ్చింది. శేఖర్ కారు ఆపి సిగరెట్ వెలిగించుకుని మళ్ళీ కారు స్టార్ట్ చేశాడు. సుకరంగా సాగుతోంది కారు—కిట కిటలు తగ్గాయి.

'తీవ్రంగా ఆలోచిస్తున్నావా కళ్యాణి?' అన్నాడు శేఖర్.

అతని ఏకవచన ప్రయోగం — ఇంతకు ముందు ఎప్పుడూ లేనిది-ఆమెకి అవమానం లాగ అనిపించింది. కాని, మరుక్షణం ఆమె అతన్ని క్షమించింది. అతని మనస్సులో దురుద్దేశం ఏమిలేదని తెలుసును,

అవునన్నట్టు తల ఊపింది. అతను మళ్లా నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

ఆ ఇల్లు మొట్టమొదట చూసినప్పుడు ఆమె చాలా గాభరాపడింది... 'ప్రమాదం లేదులే ... నీకూ అలవాటవుతుంది!' అని తనకి ధైర్యం ఇవ్వడానికి మూర్తి ప్రయత్నించాడు. అతని ఆధిక్యతనీ, ఈ క్రొత్త పరిసరాలనీ ఆమె అంగీకరించే ప్రయత్నం కష్టంగా అనిపించింది. కాని, ఆమె తనకి తానూ కొంత ధైర్యం చెప్పుకుంది. ఏమైనా తన ఇల్లది; తన ఊరు—తనభర్త.

ఆ నమ్మకతో ఆర్నెల్లు గడిచాక ఆమెకి ఆత్మవిశ్వాసం క్రమంగా తగ్గిపో సాగింది. ఒక సాయంత్రం ఇంటి గుమ్మం ముదు గడ్డిలో పెద్దపాము కనిపించి ఆమెకి ప్రాణం పోయినంత పనైంది. ఏం చెయ్యాలో తెలియలేదు. అతను దీపాలు పెట్టేక కాని రాడు—ఊరిలో వయోజన విద్యాకేంద్రానికి వెళ్లి పడుకి వొస్తాడు.

కాళ్లనిండా కప్పుకుని మంచంమీద కూర్చుని, ఉన్న రెండుదీపాలూ మంచంప్రక్కలన పెట్టి బితుకు బితుకుమంటూ కూర్చుంది కళ్యాణి. అతను వొస్తూనే ఆశ్చర్యపడి, ఏమిటీ అవతారం?' అన్నాడు నవ్వుతూ, వెక్కిరిస్తోన్నట్టు.

'మీకు పాము కనపడలేదా? గుమ్మం అవతల?' అంది కళ్యాణి, వొణికిపోతూ.

'ఏదో నీటిపామయి ఉంటుందిలే.— వర్షాలు పడ్డాయిగా దానికింత భయమేమిటి?' అన్నాడు, నిశ్చలంగా మూర్తి.

ఆమెకి ఏడుపు వొచ్చేసింది.

'నాకు భయం...ఈ ఇంట్లో ఉండలేను మరేదైనా ఇల్లుచూడండి. ప్లీజు!' అంది. ఏడుస్తూనే. అతను నవ్వి, 'ఇది మన యిల్లుగదా? ఎక్కడికి పోతాం? రేపు ఆగడ్డికోయిస్తేసరి' అన్నాడు.

రకరకాల దెబ్బలు తిన్నట్టయింది కళ్యాణికి—అతనింతగా తన క్షేమం పట్టించుకోడని ఆమె అనుకోలేదు. నిజమైన భయం, అతనిమీది అనుమానంలోని భయం, తన నిస్సహాయతలోని నిజమైన భయం—అన్నీ కలిసి ఆమెని చాలా బాధపెట్టాయి. ఆ బాధనించి కొంతకాలానికి కొంత కోలుకున్నా నిజంగా పూర్తిగా ఆమె నిముక్తురాలు కాలేకపోయింది.

అయినా సంవత్సరం జరిగింది.

పెళ్లి అయినరోజు పండుగలాగ ఉండాలి అని అనుకుంది కళ్యాణి. ఫస్ట్ ఆనివర్సరీ—అ ఇంట్లో ఇంకేమీ పండుగలు జరిగేవి కావనే బాధకరమైన మరొక విషయాన్ని ఆ కల మరిపింప జేసింది కళ్యాణిచేత.

రెండు మూడు రోజులు ముందరిదాకా ఆమె ఏమీ అనలేదు— అతనే ఏదో అంటాడనే ఆశతో. రోజు లలాగే కరిగిపోయాయి... అతని కా ధ్యాసేలేదు. అతని కా మాట జ్ఞాపకం చెయ్యాలనిపించలేదు— ఆ రోజు రాత్రి ప్రత్యేకం తయారు చేసిన స్వీట్ చూసి అత నడిగేదాకా. వ్యంగ్యంగానే, అప్పుడు ఆమె అతనికి ఆ మాట జ్ఞాపకం చేసింది.

'అలాగా!' అన్నాడు మూర్తి. అంతే,

అతన్ని చంపేద్దామన్నంత కోపం వొచ్చింది కళ్యాణికి. ఆ రాత్రి అతనేదో నాటకం చూడ్డానికి వెళ్ళిపోయాడు. ఆమె ఎంతగానో ఏడ్చింది. కళ్యాణికి తన అశక్తత క్రమక్రమంగా భయం భయంగా, భయంకరంగా తెలసివొచ్చింది. అతని నిర్లిప్తత అనుక్షణమూ ఆమెని బాధించడం మొదలుపెట్టింది. జీవితం అంతా చీకటిగా, ఎడారిగా కనిపించింది. ఆ మారుమూల ఊరిలో, మూర్తి భార్యగా తప్ప ఇంకేమీకాని ఉనికిలో, తనకి దారేమిటో తెలియలేదు కళ్యాణికి. అమ్మ బ్రతికి ఉంటే బాగుండుననీ, ఒక్క అన్న ఉండివుంటే బాగుండుననీ ఆమె కనిపించేది.

'నేనూ ఇక్కడ ఉన్నాను... కళ్యాణీ! ఎందుకంత తీవ్రంగా నీలో నువ్వే ఆలోచిస్తున్నావు?' అన్నాడు శేఖర్.

'మీకు తెలీదు!' అంది కళ్యాణి. గాద్గదికంగా వొచ్చింది ఆమె కంఠస్వరం.

కారు వేగంగా సాగిపోతోంది.

'నాకు తెలుసును కళ్యాణీ! నాకు తెలుసును. ఒక నిర్ణయం అయ్యాక ఊరికే ఆలోచించడం మంచిపద్ధతి కాదు' అన్నాడు శేఖర్.

* * *

'ఎందుకిలాగ కుమిలిపోతూ ఉంటారు మీరు?' అన్నాడు ఆ రోజు శేఖర్, చెట్టుకింద గడ్డిలో తన ఎదురుగా కూర్చుని.

'ఏం చెప్తే ఏం తెలుస్తుంది?' అంది తాను.

'ప్రయత్నించండి!' అన్నాడు శేఖర్.

అతనూ మూర్తీ ప్రాణస్నేహితులు. ఎమ్. ఏ. దాకా కలిసి చదివాక అతను పెద్ద ఉద్యోగంలో విశాఖపట్టణంలో ఉంటున్నాడు. గర్వంగా, ఆప్యాయంగా అతన్ని పరిచయంచేసి, 'కళ్యాణీ! వీడు నాకు రెండో ప్రాణం. నీకు కొంత కాలక్షేపం ఇచ్చే పూచీ వాడికే ఉంది... ఈ ఉద్యోగం వొదిలేసి అక్కడికి రమ్మని నన్ను కాల్చుకుని తినకుండా మాత్రం చూడు' అన్నాడు మూర్తి.

ఆ విచిత్రమైనపరిచయంలో వికారం చాలా కనిపించినా, వైవాహిక జీవితంలో అడుగుపెట్టాక ఒక్క ఆశారేఖ కనిపించింది కళ్యాణికి.

'మీకు అర్థం అవడంలేదా?' అంది కళ్యాణి.

'ఐంది...' అన్నాడు శేఖర్.

'ఏం చెయ్యను?' అంది కళ్యాణి. త్వరత్వరగా మనుషుల దగ్గరికి వొచ్చే స్వభావం శేఖర్‌ది. వారం తిరిగేలోగానే అతనామె కెంతో ఆప్తుడయిపోయాడు. ఎంత చనువు ఉన్నా, హద్దులనీ, మర్యాదనీ జాగ్రత్తగా పాటించే శేఖర్ మీద చాలా ఉన్నతమైన భావమూ, లోతైన అభిమానమూ కళ్యాణికి కలగడంలో ఆశ్చర్యంలేదు.

పది రోజులుండి శేఖర్ వెళ్ళిపోయాడు. కళ్యాణి ఆ తరవాత ఒక రోజు భర్తతో, 'ఏమండీ! ఎన్నాళ్ళని ఇక్కడ పడి ఉంటారు?' అంది.

'అదేమిటి?' అన్నాడు మూర్తి ఆశ్చర్యంగా.

'మీ డిగ్రీతో ఏ కాలేజీలోనో ఉద్యోగం చూసుకోవొచ్చునుగదా! ఈ పల్లెటూరిలో ఎంతకాలం పడి ఉంటారు?' అంది కళ్యాణి.

'ఇది నా ఊరు... నా పని అంతా ఇక్కడే ఉంది' అన్నాడు మూర్తి.

కొంచెంసేపు ఏమీ అనలేకపోయింది కళ్యాణి. తన బాధని మాటల్లో పెట్టాల్సి వొచ్చినందుకు బాధపడుతూ, 'మరి నా మాట?' అంది.

అర్థంకానట్లు చూశాడు మూర్తి,

'నా కిక్కడ దుర్భరంగా ఉంది...'

'ఏం?'

అతనికేం చెప్పాలో తెలియక 'ఆలోచించుకోండి—మీకే తెలుస్తుంది!' అంది కళ్యాణి.

'నువ్వే ఆలోచించు' అన్నాడు మూర్తి.

ఆమె చాలా ఆలోచించింది. మూర్తిని గురించి కాదు-శేఖర్ చెప్పినదాన్నిగురించి...

* * *

కారు రోడ్డుమీద సాగుతోంది.

మళ్లా గతుకులదారి – పెద్ద రోడ్డుమీద మళ్లీ పెద్ద గతుకులు.

నాతోమాట్లాడు కళ్యాణీ! అన్నాడు శేఖర్. ఆమె ఏమీ అనలేదు.

చనువుగా ఆమె గడ్డాన్ని చేతితో పట్టుకుని తనవేపు కప్పుకుని. 'చూడు, కళ్యాణీ! కొత్త జీవితంలోకి వొస్తున్నావు ... నువ్వు ఇలాగ మాట్లాడకుండా కూర్చుంటే ప్లాన్స్ ఎలాగ వేస్తాం?' అన్నాడు శేఖర్. అతని రెండోచెయ్యి స్టీరింగ్ వీల్ మీద.

యాంత్రికంగా అతని చేతిని తప్పించుకుని, కొంచెం జరిగి కూర్చుంది కళ్యాణి. ఆమెని అతనప్పటిదాకా ముట్టుకో లేదు.

*　　　*　　　*

ప్లాన్స్' అన్నీ ముందే వేశాడు శేఖర్. ఆమెకి కాలేజిలో సీటు తీసుకోవడం, హాస్టల్లో ఏర్పాటు చెయ్యడంతోసహా. ఏ ప్లాన్స్ గురించి ఇతను మాట్లాడ్డం? అనుకుంది కళ్యాణి.

'మీరు మరో ఊరిలో ఉద్యోగంచేస్తేసరే...' అని, వారం క్రిందట ఒకరోజు సంభాషణ ప్రారంభించింది కళ్యాణి.

'లేకపోతే?'

'ఆలోచిస్తాను.'

'వో!' అన్నాడు మూర్తి. అతనిలో వేశే చలనం ఏమీ కనిపించలేదు.

అమర్నాడు శేఖర్ అన్నీ సిద్ధంచేసుకుని వొచ్చాడు. తననిర్ణయం ఒక్కటే బాకి.

'నా కోసం ఇదంతా ఎందుకు చేస్తున్నారు?' అని అడిగింది కళ్యాణి.

'మీకు జీవితంమీద ఆశపోలేదు కనక!' అన్నాడు శేఖర్.

ఆమె చాలా ఆలోచించింది.

నిద్రలేని రాత్రులు.

విశ్రాంతిలేని మెదడు — వారం తిరిగే సరికి శేఖర్ వొస్తే, వెళ్ళాలా? మానాలా?

ఇంట్లో పని అంతా పాడుపని ఐంది— అ వారమూ. 'మరుపు వొచ్చేసింది నీకు!' అని మూర్తి నాలుగైదుసార్లన్నది ఆమెకి బాగా జ్ఞాపకం...ఒకసారి కూరలో రెండుసార్లు ఉప్పు వేసింది. మరోసారి—

ఆమె మాట్లాటలేదు. వారం తిరిగింది —శేఖర్ వొచ్చాడు కార్లో. కళ్యాణి ఒక్క ఉత్తరంతో తెగతెంపులు చేసుకుంది.

రోడ్డుపక్క చెట్టుకింద కారు ఆగిపోయింది. వెనక్కి జేరబడి సిగరెట్ వెలిగించాడు శేఖర్.

'ఏమిటండీ? ఏమైంది?' అంది కళ్యాణి.

చిరునవ్వుతో తమ వొంకచూసి; ఎడమచెయ్యి ఆమె వైపు జాపాడు శేఖర్. అతని ముఖంలో ఏదో విచిత్రమైన రంగు కనిపిస్తోంది కళ్యాణికి. అర్థం కాని రంగు.

'ఏమిటి?' అంది కళ్యాణి.

'దగ్గరగా రా ... చెప్తాను, నువ్వంత దూరంగా కూర్చుంటే ఆలోచన సాగడం లేదు' అన్నాడు శేఖర్.

అతని ముఖంలోకి పరిశీలనగా చూసింది కళ్యాణి. క్రమంగా ఆమెకి అవగతం కాసాగింది. అతని విషయంలో ఆమె ఉద్దేశాలన్నీ ఒక్కమారు తారుమారు కావడంతో ఆమె కొద్దిక్షణాలు మాట్లాడలేకపోయింది.

దగ్గరగా జరుగుతోన్న అతనినించి దూరంగానూ జరగలేకపోయింది కళ్యాణి — శక్తి లేకా, అటు ఖాళీలేకా,

భుజాలమీద చెయ్యివేసి దగ్గరగా తీసుకునే ప్రయత్నం చేస్తూ, 'చూడు, కళ్యాణీ! నీ కోసం చాలా బాధపడ్డాను. నా స్నేహితుణ్ణి మోసగించాను... అదంతా నీకూ తెలుసును, ఎంతసేపని నీ కోసం ఎదురుచూడను?' అన్నాడు శేఖర్.

మరికొన్ని క్షణాలు నిశ్చేతనంగా ఉండిపోయి, 'నేను చాలా పొరపాటు చేశాను...' అంది కళ్యాణి. చిన్న గొంతుకతో, తనకి తాను రహస్యం చెప్తోన్నట్టు.

నవ్వి, 'అవును కళ్యాణి! రెండు గంటలసేపు నువ్వంత దూరంగా కూర్చోడం పొరపాటు కాదా?' అన్నాడు శేఖర్. 'దానికి పరిహారం ఉందిగా! అంత తెల్లబోకు—బాధపడకు!'

ముఖం చేతుల్లో కప్పుకుని, 'మీరు— మీరు చాలా తప్పుగా అర్థం చేసుకున్నారు' అంది కళ్యాణి.

'కాదు కళ్యాణీ...!'

'అవును—నే నలాటి మనిషిని కాను—'

మళ్లీ నవ్వేడు శేఖర్. 'అలాటి మనుషులు' ప్రత్యేకంగా ఎక్కడా ఉండరు కళ్యాణీ! ప్రతి మనిషీ ఎప్పుడో ఎక్కడో, పరిస్థితులకి లొంగుతాడు—నాలాగ; నీలాగ. అన్నీ కాదని నువ్వు నీ జీవితం నీ చేతుల్లోకి తీసుకున్నావు. నేను నిన్ను నా చేతుల్లోకి తీసుకున్నాను...'

'ఆటబొమ్మని కాదు నేను, శేఖర్!' అంది కొంచెం కోపంగా, కళ్యాణి.

'నేనూ కాదు కళ్యాణీ!' అన్నాడు శేఖర్—ఆటలు చాలన్నట్టు; ఆటలతో విసిగిపోయినట్టు.

'నేను చాలా పొరపాటు పడ్డాను — నన్ను వెనక్కి తీసుకుపొండి — ఆ నరకమే భరిస్తాను' అంది కళ్యాణి ఉద్రేకంగా.

ఆశ్చర్యంగా చూశాడు శేఖర్.

'తొందరపడకు కళ్యాణి! ఇంతదూరం వొచ్చాక—'

'తప్పుదారి ఎంతదూరం వొచ్చినా తప్పే. నన్ను వెనక్కి తీసికెళ్ళండి' అంది కళ్యాణి.

చాలాసేపు ఆమె కళ్ళల్లోకి చూశాడు శేఖర్. అక్కడ ఆటలేమీ కనిపించలేదు.

'స్టేషన్‌లో దింపుతాను. మీ ఊరికి మళ్ళీ వొచ్చే సహానం లేదు...' అని, శేఖర్ కారు స్టార్టుచేశాడు. మరో పదిహేను నిమిషాల్లో అమెని స్టేషన్లో వొదిలి, టికెట్ కొని ఇచ్చి అతను వెళ్లిపోయాడు.

* * *

కళ్యాణి ఇంటికి చేరేసరికి చీకటి పడుతోంది. ఆమె ఇంటిదగ్గరికి వొచ్చేసరికి ఆమె తత్తరపడింది — ఆ పాక యిల్లు కూలిపోయిం !

చేతిలోని సూట్‌కేస్ గడ్డిమీద పడేసి, మరో పది అడుగులు వేసింది కళ్యాణి. ఆమె కక్కడ ఎవరూ కనిపించలేదు.

వెయ్యి పీడకలలు కనిన చోటైనా. ఇల్లు కాలిపోగానే జాలి వేసింది ఆమెకి. రోజంతా జరిగిన చరిత్ర తరవాత నీరసం —ప్రస్తుతపు పరిస్థితిని గుర్తించాక భయం.

ఇంటి నుసినించి అప్పుడు అప్పుడూ నిప్పుల తారకలు వొస్తున్నాయి. 'సాలాగే ఉన్నావు నువ్వూ' అనుకుంది కళ్యాణి.

'ఎక్కడికి వెళ్లాలి?'

'ఏం చెయ్యాలి?'

ఆమె తన సూట్ కేస్ దగ్గరికి వొచ్చేసరికి అటునించి మూర్తి వొస్తూ 'అరే!' ఎంతసేపైంది నువ్వొచ్చి కళ్యాణి?' అన్నాడు.

ఏం చెప్పాలో తెలియక, సూట్ కేస్ మీద నీరసంగా చతికలబడింది కళ్యాణి.

మూర్తి రెండడుగులువేసి ఆమెకి ఎదురుగా నిలబడి, 'ఉదయం మీ నాన్నగారి ఉత్తరం ఇచ్చి పంపేనుగా? వాడు నువ్వు కనిపించకపోతే ఆ ఉత్తరం బల్లమీదపెట్టి వొచ్చేశాడు. నువ్వు మీ నాన్నగారిని చూడ్డానికి వెడతావని అనుకున్నాను. కాని, వెంటనే వొచ్చేశావేం?' అన్నాడు.

తల తిరుగుతోంది కళ్యాణికి.

ఆమె జవాబుకోసం ఎదురు చూడకుండానే, 'ఏదో ఐందిలే— కుంపటి పూర్తిగా ఆర్పకుండా వెళ్ళిపోయావు— ఇంట్లో ఉన్నవన్నీ కాలిపోయాయి...' అన్నాడు.

తల ఎత్తి చూసింది కళ్యాణి. కలల్లోలాగ వినిపిస్తున్నాయి అతని మాటలు. ఆమెకి మరీ నీరసంగా అనిపించింది.

'లే కళ్యాణి!— ఈ రాత్రికి ఏర్పాటుచేశాను. రేపు ఎలాగో వెళ్లాలి...' అన్నాడు మూర్తి.

'ఎక్కడికి?' అంది కళ్యాణి.

'ఎక్కడికి? రెండు కాలేజీల ఇంటర్వ్యూకి వెళ్ళాక ఏ కాలేజీ నచ్చితే, అక్కడికి...'

'మీకు—'

'ఆఁ! క్రిందటి వారమే రాశాను. రేపు నీకు చెప్దామని అనుకున్నాను. ఇంతలో అదంతా— పోనీలే, జరిగినదంతా మంచికే. ఏం?'

'అవును!' అంది కొంచెం ఉత్సాహంగా కళ్యాణి.

'నీ ప్రయాణం సాగకపోవడం మంచిదైంది— రేపు ఇద్దరం కలిసి వెడదాము...'

'అలాగే...'

'పద'

ఆమె లేచింది. అతను సూట్ కేస్ పట్టుకుని ఆమెముందు నిలబడ్డాడు. ఆప్యాయంగా, బాధగా, కాలిపోయిన ఇంటిని మరోసారి చూసి, అడుగులు బరువుగా వేసింది కళ్యాణి.

